# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-04-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ లో పలు రైల్వే, రోడ్డు ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఈరోజు ఆమోదం తెలిపింది.
- రాష్ట్రంలో జున్ నాటికి వందశాతం చెత్తను సేకరించి వ్యర్ధాలను సంపదగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్రానికి స్పష్టం చేశారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు ఢిల్లీలో జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలోని 15 జిల్లాలను కవర్ చేసే రెండు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనితో భారతీయ రైల్వే ప్రస్తుత నెట్‌వర్క్ సుమారు 601 కిలోమీటర్ల మేర పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ లో రాజమండ్రి-విశాఖపట్నం మధ్య 3,4వ రైల్వే లైన్ల నిర్మాణంతో పాటు, గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల మేర నూతన వంతెన నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే 9,889 కోట్ల రూపాయలతో కాకినాడ, మచిలీపట్నం, గంగవరం పోర్టుల అనుసంధానం కోసం 198 కిలోమీటర్ల మేర ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు.

====================

రాష్ట్రంలో జున్ నాటికి వందశాతం చెత్తను సేకరించి వ్యర్ధాలను సంపదగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడుదవోలులో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రతీ నెలా మూడో శనివారం ఒక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఈ వారం జల హారతి-జలధార థీమ్‌తో కార్యక్రమాన్ని చేస్తున్నామన్నారు. చెత్తను ఓ సమస్యగా కాకుండా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 603 కోట్ల రూపాయలతో ఆధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ లను ఏర్పాటు చేశామన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరించి దానిని సర్క్యులర్ ఎకానమీగా మార్చేందుకు స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేశామని, ప్రతీ ఇంటికీ మరుగుదొడ్లను ఏర్పాటు చేయటం ద్వారా ఓడిఎఫ్ ప్లస్ సాధించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. చెత్తను విద్యుత్ గా మార్చడానికి మరో 6 వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం 31.33 శాతం మాత్రమే ఉందని, 2047 నాటికి అది 50 శాతానికి చేరుకోనేలా ప్రజలు సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరుతూ...

(వాయిస్...30 సెకన్లు)

అంతకుముందు చట్టసభల్లో మహిళలకి 33 శాతం రిజర్వేషన్ కల్పించే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయినందుకు నిరసనగా నిడదవోలులో చేపట్టిన ర్యాలీలో చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. మహిళా బిల్లును అడ్డుకోవటం ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డే గా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

====================

రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తోందని, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగనీయబోమని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అమరావతిలోని క్యాంప్ కార్యాలయం నుండి కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో శనగలు, మొక్కజొన్న పంటల పరిస్థితిని సమగ్రంగా వివరించి, రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది రాష్ట్రంలో శనగల సాగు గణనీయంగా పెరిగి, మొత్తం సుమారు 7,13,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. ఇప్పటివరకు 94,500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు పూర్తయిందని, మిగిలిన పంటను రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్రానికి వివరించారు. అదనంగా 1,78,250 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. పీఎస్ఎస్ స్కీం కింద అదనంగా 15 వేల మెట్రిక్ టన్నుల శనగలు తక్షణమే కొనుగోలు చేయడానికి అనుమతి ఇస్తూ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. అలాగే మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కనీస మద్దతు ధర కంటే తక్కువకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అచ్చెన్నాయుడు వివరించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. ఈ అంశంపై కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషితో వెంటనే మాట్లాడి, మొక్కజొన్న కొనుగోలు అంశంపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు.

====================

విరామం

====================

విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి తొలిరోజు హజ్ యాత్రకు 156 మంది యాత్రికులు సౌదీ అరేబియాకు బయలుదేరారు. రాష్ట్ర మంత్రులు ఎన్ ఎండి ఫరూక్, కొల్లు రవీంద్రలు, యాత్రికుల బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. యాత్ర సాఫీగా సాగాలని మంత్రులు ఆకాంక్షిస్తూ యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మైనారిటీ శాఖా మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ మాట్లాడుతూ, హజ్ యాత్ర ప్రతి ముస్లిం భక్తునికి పవిత్రమైనదని, రాష్ట్ర ప్రభుత్వం యాత్రికులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం ఎంబార్కేషన్ పాయింట్ వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారని మంత్రి వివరించారు.

====================

పార్లమెంటులో మహిళా నారీ శక్తి వందన్ అభియాన్ బిల్లు ప్రవేశపెట్టడం దేశంలోని మహిళలందరికీ గర్వకారణమని రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఈరోజు నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ బిల్లు మహిళా సాధికారత దిశగా కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే దేశ ప్రగతి మరింత వేగవంతమవుతుందని, అదే లక్ష్యంతో ఈ బిల్లు తీసుకువచ్చారన్నారు. ఇలాంటి కీలక బిల్లులకు ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వకపోవడం బాధాకరమని మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా సాధికారత, సమాన హక్కుల అంశాల్లో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని, మహిళల భాగస్వామ్యంతోనే దేశ అభివృద్ధి మరింత సమగ్రంగా, వేగవంతంగా ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్…25 సెకన్లు)

====================

ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని గుంటూరులో ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్.. ఇంటాక్ అధ్వర్యంలో స్థానిక జె.సి. న్యాయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వారసత్వ పరిరక్షణపై ప్రముఖ చారిత్రక పరిశోధకులు శ్రీనాథ్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఇంటాక్ గుంటూరు శాఖ అధ్వర్యంలో నగర వీధులలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. అనంతరం స్థానిక బౌద్ధశ్రీ పురావస్తు శాలకు విద్యార్థులను తీసుకువెళ్లి, అక్కడి చారిత్రక విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఇంటాక్ గుంటూరు సభ్యులు, రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరాజు, జెసి న్యాయ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=====================

ఐపీఎల్ క్రికెట్ లో భాగంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా.. ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన రాయల్ చాలెంజర్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేసింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 5 ఓవర్లు పూర్తయ్యేసరికి 3 వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది. అలాగే... ఈరోజు రాత్రి 7 గంటల 30 నిముషాల నుండి హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మరో మ్యాచ్ జరగనుంది.

=====================
=====================